
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్
కోనసీమ
జిల్లా వార్తలు
ఆదివారం 26 అక్టోబరు 2025 | 5







నాగేంద్రునికి పూజలు

నాగుల చవితి పర్వదినాన్ని జిల్లా అంతటా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పుణ్యస్నానాలు ఆచరించి పాముల పుట్టల్లో పాలు పోశారు. కోడిగుడ్లు ఉంచారు. చలిమిడి, చిమ్మిలి నైవేద్యంగా సమర్పించారు. అలాగే అన్ని సుబ్రహ్మణేశ్వర స్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కోనసీమ జిల్లావ్యాప్తంగా పుట్టలు అధికంగా ఉండడంతో అంతటా ఇదే సందడి కనిపించింది. ముమ్మిడివరంలో పుట్టలో పాలు పోస్తున్న దృశ్యమిది.

నేడు విద్యుత్ బిల్లులు కట్టొచ్చు

అమలాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని విద్యుత్, రెవెన్యూ కార్యాలయాల్లో సెలవు రోజైన ఆదివారం విద్యుత్ బిల్లుల వసూళ్ల కౌంటర్లు యథావిధిగా పనిచేస్తాయని ట్రాన్స్‌కో ఎస్ఈ జి.రాజేశ్వరి తెలిపారు. జిల్లాలోని విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని ఆమె కోరారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయాలతోపాటు ఏపీఈపీడీసీఎల్ సెక్షన్ ఆఫీసు కౌంటర్లు, ఏటీపీ సెంటర్లలో కూడా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని ఆమె తెలిపారు.

నేడు 'కవిసంధ్య' దశాబ్ది ఉత్సవం

పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు శిఖామణి జీవన సాఫల్య పురస్కారం

7

రేపటి నుంచి రాజమహేంద్రవరానికి నాన్‌స్టాప్ సర్వీస్

అమలాపురం రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి):అమలాపురం నుంచి రాజమహేంద్రవరానికి ప్రయాణికుల రద్దీ దృష్ట్యా నాన్‌స్టాప్ సర్వీసులను తిరిగి ఈ నెల 27వ తేదీ సోమవారం నుంచి ప్రారంభిస్తున్నట్టు జిల్లా ప్రజా రవాణాధికారి ఎస్టీపీ రాఘవకుమార్ తెలిపారు. అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే బస్సులు నడిపూడి, ముక్కామల మీదుగా ప్రతీరోజు ఉదయం 5.30 గంటల నుంచి ప్రారంభమై ప్రతీ రెండు గంటలకు ఒకసారి ఉంటాయని ఆయన తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం నుంచి అమలాపురం డిపోకు చెందిన బస్సులు అమలాపురానికి వచ్చేందుకు ప్రతీ రెండు గంటలకు ఉంటాయని తెలిపారు.

'పీఎంశ్రీ పాఠశాలలో సివిల్ వర్క్‌లు పూర్తి చేయాలి'

ముమ్మిడివరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న పీఎంశ్రీ పాఠశాలలో సివిల్ వర్క్ పనులను నెలాఖరులోపు పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా, ఏపీసీ జి.మమ్మి ఆదేశించారు. ముమ్మిడివరం డీఈవో కార్యాలయంలో శనివారం సెక్టోరల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఉన్న 26 పీఎంశ్రీ పాఠశాలల్లో పూర్తికావాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లోను నెలాఖరు నాటికి పూర్తి చేయాలన్నారు. 'మనబడి మన భవిష్యత్తు' పథకానికి సంబంధించి పెండింగ్ పనులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. వీరగాథ 5.0లో భాగంగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి ఆ పోటీల్లో విజేతల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే పాఠశాలకు మంజూరైన గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్, ఎమ్మార్సీ గ్రాంట్లను పీఎంసీ యాప్‌లో అంచనాలు, బిల్లులు, అప్‌లోడ్ ఏ మేరకు అయిందనే విషయాలను మండల విద్యాశాఖాధికారులతో సమీక్ష చేయాలని సూచించారు. సెక్టోరల్ అధికారులకు సంబంధించి దత్తత మండలాల్లో విద్యాశాఖ, సమగ్ర శిక్ష కార్యక్రమాల ప్రగతిని సమీక్షించారు. సెక్టోరియల్ అధికారులు పాఠశాల సందర్శన సమయంలో 8, 9, 10 తరగతుల విద్యార్థుల విద్యాస్థాయిని పరిశీలించారు. సమావేశంలో ఫైనాన్స్ అండ్ అక్కౌంట్స్ విభాగ అధికారి జి.ప్రవీణ్‌కుమార్, సమగ్రశిక్ష ఈఈ సుబ్బరాజు, డీఈఈ నాగేశ్వరరావు, సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్యం, డి.రమేష్‌బాబు, పి.రాంబాబు, ఎంపీకే భీమారావు, ఎంపీపీ సత్యనారాయణ పాల్గొన్నారు.



భయమొంథా!

దూసుకొస్తున్న తుఫాన్

కాకినాడకు 900 కి.మీ

ఆగ్నేయ బంగాళాఖాతంలో శనివారం సాయంత్రం నాటికి గంటకు ఏడు కిలో మీటర్ల వేగంతో వాయుగుండంగా కదులుతోంది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ ఆదివారం నాటికి తీవ్ర వాయు గుండంగా, సోమవారం నాటికి తుఫాన్‌గా, మంగళవారం నాటికి తీవ్ర తుఫాన్‌గా బలపడనుంది. ప్రస్తుతానికి పోర్టు బ్లెయిర్‌కు 440 కి.మీ, విశాఖకు 970 కి.మీ, కాకినాడకు 900 కిలోమీటర్ల దూరంలో కొనసాగుతోంది. మంగళవారం అర్ధరాత్రికి తీవ్ర తుఫాన్ కాకినాడలో తీరం దాటనున్నట్టు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీయనున్నాయి. అటు తుఫాన్ తీరం దాటే సమయంలో గరిష్ఠంగా 20 సెంటీ మీటర్ల మేర కుంభవృష్టిగా వానలు కురవనున్నాయి.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ వైపు మొంథా తుఫాన్ ముంచుకొస్తోంది. ప్రచండ వేగంతో కదులుతూ తీరం వైపు దూసుకొస్తోంది. కాకినాడ పోర్టు - తుని మధ్య మంగళవారం అర్ధరాత్రి తీరం దాటే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సోమ, మంగళ, బుధవారం మూడు రోజులపాటు వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. అత్యవసరమైతే తప్పించి ప్రజలు ప్రయాణాలు మానుకోవాలని హెచ్చరించింది.

- మంగళవారం అర్ధరాత్రి నుంచి తీవ్రత
- కాకినాడ పోర్టు-తుని మధ్య తీరం దాటే అవకాశం
- ఆ సమయంలో గంటకు 100కి.మీ వేగంతో గాలులు
- మూడు రోజులు రెడ్ అలెర్ట్ - కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు
- పోర్టులో ఐదో నెంబర్ ప్రమాద హెచ్చరిక
- తూర్పున స్కూళ్లకు సోమ, మంగళవారం సెలవులు
- ఆది, సోమవారాలు కాకినాడ బీచ్ మూసివేత



కాకినాడ, కోనసీమల్లో హైఅలెర్ట్

కాకినాడ,కోనసీమ,తూర్పుగోదావరి జిల్లాల్లో కలెక్టరేట్లు, ఆర్డీవో కార్యాలయాలు, జలవనరులశాఖ, ట్రాన్స్‌కో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశాయి. మూడు జిల్లాల కలెక్టర్లు తుఫాన్ సన్నాహక చర్యలపై వివిధ శాఖల అధికారులతో శనివారం సమీక్షించారు. తూర్పుగోదావరి జిల్లాలో సోమ, మంగళవారాలు స్కూళ్లకు సెలవులు ప్రకటించారు. కాకినాడ బీచ్‌ను ఆదివారం, సోమవారాలు మూసివేస్తామని ప్రకటించారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని తీర ప్రాంత మండలాల్లో హైఅలర్ట్ జారీ చేశారు. ఈ రెండు జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించాల్సి ఉంది. పెనుగాలుల ధాటికి విద్యుత్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏలేరు రిజర్వాయరులో ముందుగానే నీటిని విడుదల చేయడంతో పరీవాహక ప్రాంతాలను అప్రమత్తం చేశారు. తుఫాన్ తీరం దాటే సమయంలో కాకినాడ జిల్లాపై తీవ్ర ప్రభావం పడనుంది. భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందన్న హెచ్చరికలతో గ్రామ స్థాయిలో సిబ్బంది అంతా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి కార్యాచరణ రూపొందించారు. తుఫాన్ పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. నిత్యావసరాలను తగిన ప్రదేశాల్లో ఉంచేలా పౌరసరఫరాల శాఖ ఏర్పాట్లు చేస్తోంది. టెలికం ఆపరేటర్లు సమన్వయంతో మొబైల్ టవర్ల వద్ద జనరేటర్లు ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ సేవల్లో ఇబ్బందులు కలగకుండా చర్యలకు ఆదేశించారు.

థాయ్‌లాండ్ పేరు పెడితే ఇంతే..

1992 నుంచి ఇప్పటివరకు కాకినాడలో నాలుగు తుఫాన్లు తీరం దాటాయి. 1992లో నవంబరు 6న కాకినాడ వద్ద తుఫాన్ తీరం దాటిన సమయంలో ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో భారీ నష్టం సంభవించింది. 1996 నవంబరు 6న కాకినాడలో తుఫాన్ తీరం దాటిన సమయంలో భారీ గాలులు తీవ్ర నష్టం తెచ్చిపెట్టాయి. 2000లో తుఫాన్లకు పేర్లు పెట్టడం అమల్లోకి వచ్చింది. 2018 డిసెంబర్ 13 నుంచి 18 మధ్య పెథాయ్ తుఫాన్ కాకినాడ-యానాం మధ్యలో తీరం దాటింది. ఈ తుఫాన్‌కు అప్పట్లో థాయ్‌లాండ్ పేరు సూచించింది. ఆ తర్వాత 2020 అక్టోబరు 13న కాకినాడలో ఓ మోస్తరు తుఫాన్ తీరం దాటింది. మళ్లీ ఇప్పుడు తీవ్ర తుఫాను ఏడేళ్ల తర్వాత కాకినాడలో తీరం దాటే అవకాశం ఉంది. ఈ తుఫాన్‌కు మొంథాగా థాయ్‌లాండ్ దేశం నామకరణం చేసింది. థాయ్‌భాషలో మొంథా అంటే సువాసన వెదజల్లే పుష్పం. ఒకరకంగా చెప్పాలంటే థాయ్‌లాండ్ తుఫాన్లకు పేర్లు పెడితే కాకినాడకు మూడినట్టేనన్న చర్చ జరుగుతోంది. గతంలో పెథాయ్ తుఫాన్ కాకినాడలో తీరం దాటిన సమయంలో గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల మధ్య వేగంతో గాలులు వీచాయి. అత్యధికంగా తాళ్లరేవు మండలంలో 16 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అప్రమత్తంగా ఉండండి : పవన్

పిఠాపురం,అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఇతర అధి కారులతో శనివారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాకినాడ జిల్లాలో సముద్ర తీరప్రాంతం ఉన్న పిఠాపురం, తుని, కాకినాడ రూరల్, సిటీ నియోజకవర్గాలతోపాటు తాళ్లరేవు మండలంపై తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండబోతోందని వాతావరణశాఖ వేసిన అంచనాలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. తీరం వెంబడి ఉన్న గ్రామాల్లోని ప్రజలు సురక్షితం గా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఏలేరు రిజర్వాయర్ పరిస్థితిపై డిప్యూటీ సీఎం ఆరా తీశారు. పిఠాపురం, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు తదితర నియోజకవర్గాల ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని సూచించారు.

వస్తానన్న పవన్.. వద్దన్న కలెక్టర్



తుఫాన్ ప్రభావం సమాచారంతో కాకినాడ జిల్లాకు వస్తానని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కలెక్టర్ షాన్‌మోహన్‌కు తెలియజేశారు. అధికారయంత్రాంగం అంతా తుఫాన్ ఎదుర్కొనే సన్నద్ధతలో ఉందని.. ఇటువంటి సమయంలో జిల్లా పర్యటన వద్దని కలెక్టర్ సూచించారు. దీంతో పవన్ తన నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు.

నౌకలన్నీ సముద్రంలోకే...

తుఫాన్ కాకినాడ పోర్టు- తుని సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తుండడంతో కాకినాడ యాంకరేజ్, డీప్ వాటర్ పోర్టులు అప్రమత్తమయ్యాయి. సోమవారం నుంచి మూడు రోజులు అన్ని కార్గో ఎగుమతి, దిగుమతులు నిలిపివేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం డీప్‌వాటర్ పోర్టులో 19, యాంకరేజ్‌పోర్టులో ఆరు నౌకలు కార్గో కోసం లంగరు వేశాయి. వీటిని సోమవారం మధ్యాహ్నం తీరం నుంచి 150 నాటికల్ మైళ్ల దూరానికి తరలించనున్నారు. పోర్టులో సోమవారం నుంచి ఐదో నెంబరు ప్రమాద హెచ్చరిక ఎగురవేయనున్నారు. గడచిన ఏడేళ్లలో ఇదే తొలిసారి అని అధికారులు వివరించారు.





తనిఖీల తర్వాత సీజ్ చేసిన మార్నింగ్ ట్రావెల్ బస్సు.. బస్సులో తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు

ప్రైవేటు ట్రావెల్స్‌పై ఆర్టీఏ అధికారుల కొరడా

జిల్లావ్యాప్తంగా వివిధ కీలక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు

27 బస్సులపై కేసులు నమోదు.. ఒకటి సీజ్ : డీటీవో శ్రీనివాస్

అమలాపురం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న ప్రైవేటు ట్రావెల్స్‌పై రోడ్డు ట్రాన్స్‌పోర్టు అధికారులు కొరడా ఝులిపించారు. కర్నూలులో బస్సు ప్రమాదఘటన నేపథ్యంలో అధికారులు శుక్రవారం అర్ధరాత్రి నుంచి జిల్లాలోని వివిధ కీలక ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న 27 బస్సులపై కేసులు నమోదుచేయగా, మార్నింగ్ ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సును సీజ్ చేసి ఫిట్‌నెస్ రద్దు చేశారు. ప్రతీవారం నిర్వహించే తనిఖీల్లో భాగంగానే జిల్లాలో ఈ తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. జిల్లాలో వివిధ ప్రాంతాల మీదుగా 60కుపైగా బస్సులు హైదరాబాద్ వెళుతుంటాయి. అయితే కర్నూలు ఘటన తర్వాత కొన్ని బస్సులను ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు ముందుగానే నిలిపివేశారు. అయినా శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించిన తనిఖీల్లో 27 బస్సుల్లో కేసులు నమోదుచేసి 97,600 అపరాధ రుసుముగా విధించామని శ్రీనివాస్ తెలిపారు. ముఖ్యంగా భద్రతా ప్రమాణాలు పాటించకుండా నడుపుతున్న ఈ బస్సును సీజ్ చేయడం జరిగిందన్నారు. కాగా జిల్లాలో అన్నంపల్లి, ఈతకోట టోల్‌గేట్‌తోపాటు జొన్నాడ వంటి ప్రాంతాల్లో ప్రైవేటు ట్రావెల్స్ బస్సులపై ఆర్టీఏ అధికారులు తనిఖీలు చేశారు. భద్రతా ప్రమాణాలు ఉల్లంఘిస్తే ఎట్టి పరిస్థితుల్లోను ఉపేక్షించబోమని, కేసులు నమోదు చేయడంతోపాటు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఈ తనిఖీల్లో డీటీవో దేవిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు రవికుమార్, జ్యోతిసురేష్, ఓలేటి శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, లక్ష్మీశ్రీదేవి, షణ్ముఖశ్రీనివాస్ పాల్గొన్నారు. బస్సుల్లో వసతులన్నీ తనిఖీ చేశారు.

'స్పందన'లో రూ.1.44 లక్షలు మాయం

7



కలెక్టరేట్‌లో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్

కోనసీమలో అలెర్ట్

- జిల్లా అధికారులతో కలెక్టర్ మహేష్‌కుమార్ వీడియో కాన్ఫరెన్సు
- తీరప్రాంతాల్లో పరిస్థితులను సమీక్షించాలంటూ ఆర్డీవోలు, తహశీల్దార్లకు ఆదేశం
- జిల్లాలో 428 మంది గర్భిణులను ముందస్తుగా పీహెచ్‌సీలకు తరలించాలి
- జనరేటర్లు సిద్ధంచేసుకోండి.. విద్యుత్ కార్మికులు, ట్రాన్స్‌ఫార్మర్లను రెడీగా ఉంచండి

అమలాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో ఈనెల 27 నుంచి జిల్లాలో తీవ్ర తుఫాన్ ప్రభావం ఉంటుందని, తుఫాను తీరాన్ని ఈ ప్రాంతంలోనే దాటే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్ నుంచి మండల స్థాయిలోని వివిధ శాఖల అధికారులతో తుఫాన్ ప్రభావంపై కలెక్టర్ శనివారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. తుఫానును ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగమంతా సన్నద్ధంగా ఉండాలని సూచించారు. సముద్ర తీరం వెంబడి ఉన్న గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలి, అత్యవసరమైతే తప్ప ఈ మూడు రోజులు ప్రజలు బయట ప్రయాణాలను రద్దు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో అతి భారీ వర్షాలు కురవడంతోపాటు 90 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్త వహించాలని, ముఖ్యంగా కార్తీకమాసంలో భక్తులు సముద్ర, నదీ స్నానాలు, దైవ దర్శనాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. తుఫాన్ ప్రభావంతో ఎవరికైనా ఇబ్బందుల తలెత్తితే కంట్రోల్ రూము నంబరు 08856293104కు ఫోన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. తుఫాన్ హెచ్చరికలను దండోరా ద్వారా గ్రామాల్లో తెలియజేయాలని, తీర ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయడంలో ఆర్డీవోలు, తహశీల్దార్లు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా తీర ప్రాంతంలో ఉన్న తుఫాను పునరావాస కేంద్రాలను సిద్ధంచేసి ఆయా ప్రాంతాల ఆవాసాలను మ్యాపింగ్ చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి, వీఆర్వోలను పునరావాస కేంద్రాల నిర్వహణకు ఇన్‌చార్జిలుగా నియమించాలని, పారిశుధ్య ఏర్పాట్లు పంచాయతీరాజ్‌శాఖ అధికారులు చేపట్టాలని సూచించారు. తీరం వెంబడి మూడు కిలోమీటర్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జిలను నియమిస్తూ తుఫాను హెచ్చరికలకు అనుగుణంగా ప్రజలను అప్రతమత్తంచేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈనెల 27 నాటికి నిత్యావసరాలన్నీ తీర ప్రాంతాల గ్రామాల ప్రజలు ఐదు రోజులపాటు అవసరాల మేరకు సిద్ధం చేసుకోవాలని ముఖ్యంగా మత్స్యకారులెవరూ చేపల వేటకు వెళ్లకుండా హెచ్చరికలు జారీ చేయడంతోపాటు వెళ్లినవారు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 428 మంది గర్భిణులను గుర్తించి వీరిని సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీలకు బర్త్ వెయిటింగ్ హాలులకు తరలించాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడికక్కడే జనరేటర్లు, అంబులెన్సులు, అత్యవసర ఔషధాలు సిద్ధం చేసుకోవాలని, విద్యుత్ శాఖ కార్మికులను, స్తంభాలను, ట్రాన్స్‌ఫార్మర్ల మెటీరియల్‌ను ముందస్తు నిల్వలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్లు, పీడబ్ల్యుఎస్ పథకాల వద్ద విద్యుత్‌కు ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధం చేసుకుని ప్రజలకు అవసరమైన తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. ఆర్‌అండ్‌బీ అధికారులు పవర్ జేసీబీలు, క్రేన్లను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా తుఫాను హెచ్చరికలకు అనుగుణంగా పాఠశాలలకు తాత్కాలిక సెలవులు ఇవ్వాలని ఆయన సూచించారు.

రేపు గ్రీవెన్స్ రద్దు..

ఈనెల 27వ తేదీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం తుఫాను హెచ్చరికల వల్ల రద్దయినట్టు కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. అర్జీదారులు తమ సమస్యల అర్జీలను టోల్‌ఫ్రీ నంబరు 1100 లేదా మీకోసం వెబ్‌సైట్ ద్వారా సమర్పించవచ్చని, తమ ఫిర్యాదులతో జిల్లా కేంద్రానికి రావాల్సిన అవసరం లేదని సూచించారు. సోమవారం జరగాల్సిన గ్రీవెన్స్‌ను రద్దుచేసిన దృష్ట్యా ప్రజలు గమనించాలని కోరారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు రసాయనిక కిట్లు

జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్

ముమ్మిడివరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.ఉదయభాస్కర్ తెలిపారు. ముమ్మిడివరంలోని సివిల్ సప్లయి జిల్లా కార్యాలయంలో శనివారం జిల్లాలోని పౌర సరఫరాల ఉప తహశీల్దార్లకు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనికకిట్లతో రేషన్ బియ్యాన్ని గుర్తించవచ్చన్నారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం మాఫియా చేతుల్లో దుర్వినియోగమవుతున్న సంఘటనలు తరచూ వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ అక్రమాలకు అడ్డుకట్ట వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బియ్యం ఎక్కడైనా పట్టుబడితే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారానా, లేక ప్రైవేటు మార్కెట్‌లోదా అన్న విషయం గుర్తించేందుకు కొత్త రసాయనిక కిట్లను ప్రభుత్వం అందించిందన్నారు. ఒక అంచనా ప్రకారం 60శాతం మంది కార్డుదారులు బియ్యాన్ని దళారీలకు అమ్మేస్తున్నారని, 20శాతంమంది వలస కూలీలు తాము పనిచేసే ప్రాంతాల్లోనే బియ్యాన్ని అమ్ముతున్నారన్నారు. ఈరకంగా 80శాతం బియ్యం మాఫియాల చేతుల్లోకి వెళ్లిపోవడమే మూలకారణమన్నారు. రసాయనిక కిట్లతో జిల్లాలోని 8 మంది పౌర సరఫరాలశాఖ ఉప తహశీల్దార్లు, ఇద్దరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ కొత్త రసాయనిక కిట్లు అందించినట్టు తెలిపారు. మరో కిట్ జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. బియ్యాన్ని ఈ కిట్లలోని రెండు రసాయనాలతో పరీక్షిస్తే రేషన్ బియ్యం అయితే ఎరుపు రంగులోకి మారుతుందన్నారు. ఆరు నెలల కిందట పంపిణీ చేసిన బియ్యం అయినా, పాలిష్ చేసినా ఈ పరీక్షలో ఈజీగా గుర్తించవచ్చన్నారు. ఈ విధానం ద్వారా స్పాట్‌లోనే కేసులు నమోదుచేసే అవకాశం ఉందన్నారు. సమావేశంలో ఏఎస్వో శరత్, అసిస్టెంట్ మేనేజర్ సృజన, పౌర సరఫరాలశాఖ ఉప తహశీల్దార్లు పాల్గొన్నారు.



రసాయనిక కిట్లను పౌరసరఫరాల ఉపతహశీల్దార్‌కు అందజేస్తున్న సివిల్‌సప్లయి అధికారి ఉదయభాస్కర్

ఎందుకింత నిర్లక్ష్యం

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ అసహనం
- సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- కూడళ్ల వద్ద భక్తులకు సూచీబోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశం


నూతన మెట్లమార్గాన్ని పరిశీలిస్తున్న దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో కార్తీకమాసం సందర్భంగా భక్తులకు కల్పించిన ఏర్పాట్లపై దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ శనివారం స్వీయ పర్యవేక్షణ చేశారు. భక్తులు స్వామి సన్నిధికి విచ్చేసే స్వాగత ద్వారం వద్దనే నిర్వహణ ఇలా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ముందుగా కళాశాల మైదానాన్ని పరిశీలించారు. కళాశాల ఆనుకుని ఉన్న క్రీడాస్థలం కోసం ఏర్పాటుచేసిన ఫెన్సింగ్‌ను తొలగించడంతో పాటుగా అక్కడక్కడా ఉన్న గోతులను పూడ్చాలన్నారు. టోల్ గేట్ వద్ద శానిటేషన్ సరిగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం నూతన మెట్లమార్గాన్ని పరిశీలించారు. ఇంకా అందుబాటులోకి తీసుకురాకపోవడానికి కారణమేంటని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణను ప్రశ్నించారు. మరో వారంరోజుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రక్షణగోడను రాతితో నిర్మించాలని, మెట్లమార్గంలో కేబుల్ విద్యుత్ కాకుండా సోలార్‌కు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. సీఆర్వో కార్యాలయం పరిశీలించి గదుల ఖాళీల వివరాలు డిస్‌ప్లేలో ఉండేలా చూడాలని, దీనిని రోజు జీపీఎస్ ఫోటో తీసి ఈవో ఫోన్ కు పంపించాలన్నారు. భక్తులకు ఎక్కడా సూచీబోర్డులు పూర్తిస్థాయిలో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. తాను స్పష్టమైన ఆదేశాలిచ్చినా ఎందుకు నిర్లక్ష్యం వహించారని ప్రశ్నించారు.

శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం..

అనంతరం ఆయన వినాయక అతిథిగృహంలో ఈవో, ఛైర్మన్, ఏఈవోతో సమావేశమయ్యారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేవిధంగా చూడాలని వసతిగదులు, అందులో మౌలికవసతులపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విష్ణుసదన్ హాల్స్ పరిశీలించి శానిటేషన్ నిర్వహణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తుల విశ్రాంతి తీసుకునే హాల్స్‌లో వివాహ డెకరేషన్ మండపాలు ఉండడంతో వివాహం అనంతరం తొలగించేలా చూడాలన్నారు. భక్తుల కోసం నిర్మించిన విశ్రాంతి షెడ్డులో వ్రతం టిక్కెట్లు, ప్రసాదం కౌంటర్లు ఏర్పాటుచేసిన ప్రదేశం సరిగా లేదని దానిని చివరకు మార్చాలని రద్దీసమయంలో హోల్డింగ్ పాయింట్ల వద్ద నిండిన జనం ఈ విశ్రాంత షెడ్డుకు వచ్చేలా చూడాలని సూచించారు. అనంతరం కమాండ్ కంట్రోల్‌రూం వద్ద సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఉద్యోగి తనకు అప్పగించిన బాధ్యతలతో పాటుగా మిగిలిన వాటిలో కూడా భాగస్వామ్యం కావాలన్నారు. శని,ఆది,సోమవారాలతో పాటుగా ఏకాదశి, దశమి, కార్తీకపౌర్ణమి రోజుల్లో ఈవో పశ్చిమరాజగోపురం వద్దనే ఉండి పర్యవేక్షణ చేయాలని కమిషనర్ ఆదేశించారు. తప్పనిసరిగా రోప్ ఉండాలని దీనిద్వారా తోపులాటలు నివారించవచ్చన్నారు. వాకీటాకీల ద్వారా ఎప్పటికప్పుడు మోనటరింగ్ చేసుకోవాలన్నారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజు చాలా కీలకమైనదని.. ఒకపక్క స్వామి సన్నిధికి వ్రతం, దర్శనం కోసం వచ్చేవారు, మరోపక్క గిరిప్రదక్షిణకు వచ్చేవారి సంఖ్య సుమారు 2లక్షలమంది ఉంటుందని దానికణుగుణంగా వ్యవహరించాలన్నారు. గిరిప్రదక్షణ సమయంలో సత్యరథం తొలిపావంచా వద్ద ఎక్కువసేపు నిలపకుండా 15 నిమిషాల్లో కదపాలన్నారు. గిరిప్రదక్షిణ రోడ్డులో చిన్నచిన్న రాళ్లు ఉంటున్నాయని, అక్కడ రోలింగ్ చేయాలని అదేవిధంగా సుమారు 50 అదనపు టాయిలెట్లు ఉండేలా చూడాలన్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు, ఛైర్మన్ రోహిత్, అధికారులున్నారు

ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా..

కాకినాడలో ఓపెన్ హౌస్ కార్యక్రమం

విద్యార్థులకు పలు అంశాలు వివరించిన ఎస్పీ బిందుమాధవ్


గన్స్ ఉపయోగాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు




విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ ఉత్సవాల్లో భాగంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం ఓపెన్ హౌస్ నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ శాఖకు సంబంధించిన సాంకేతికత పరికరాలు, కమ్యూనికేషన్, బాంబ్ టెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ ఆయుధాలు, పోలీస్ జాగిలాల పని తీరు, డ్రోన్ల వినియోగం, వేలిముద్రల సేకరణ, బాడీ వార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం, బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్ స్పీడ్ గన్, నేర పరిశోధనలో, బాంబులను గుర్తించడంలో పోలీస్ జాగిలాల పని తీరు, బాంబ్ డిస్పోజల్ పరికరాలపై ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఎస్పీ ప్రత్యక్షంగా.. ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఈ నెల 27న కూడా నిర్వహిస్తామని విద్యార్థులు, ప్రజలు వచ్చి ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించి అవగాహన పెంచుకోవాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌టీ డీఎస్పీ కెవి సత్యనారాయణ, ఏఆర్ డీఎస్పీ వి.శ్రీహరి, సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ


తిరుచ్చివాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

అన్నవరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడికి శనివారం తిరుచ్చిసేవ వేడుకగా జరిగింది. ఉదయం 9గంటలకు స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల గోవిందనామస్మరణలు, పండితుల మంత్రోచ్ఛరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

నావల్ ఉన్నతాధికారుల పూజలు

సత్యదేవుడిని శనివారం ఈస్ట్రన్ నావెల్ కమాండ్ ఉన్నతాధికారులు బి.శివకుమార్ కటుంబసభ్యులతో దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. అనంతరం దేవస్థానం ఆధ్వర్యంలో నడపబడుతున్న ఆగమ పాఠశాల ఆహార పదార్థాలందజేశారు.


దర్శనం అనంతరం నావల్ అధికారులు

డ్వాక్రా సొమ్ముల దుర్వినియోగం..
బ్యాంకింగ్ కరస్పాండెంట్‌పై ఫిర్యాదు

కరప, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం కూరాడ-1,2, చిన్న మామిడాడలకు చెందిన 74 డ్వాక్రా సంఘ సభ్యులకు చెందిన రూ.99,86,440 పొదుపు, బ్యాంకులోను రుణం సొమ్ము దుర్వినియోగానికి పాల్పడిన బ్యాంకింగ్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతిపై క్రిమినల్ కేసు నమోదు చేసి రికవరీ చేయాలని కోరుతూ శనివారం డీఆర్‌డీఏ ఏపీడీ ఎం.ఎం.జిలానీ కరప ఎస్ఐ తోట సునీతకు ఫిర్యాదు చేశారు. డ్వాక్రా సంఘ సభ్యులు ఇచ్చిన పొదుపు, లోనుసొమ్మును బ్యాంకులకు చెల్లించకుండా దుర్వినియోగానికి పాల్పడినట్లు పత్రికల్లో కథనాలు,సభ్యుల ఫిర్యాదుతో విచారణ చేయడం జరిగిందని, ఈ విచారణ నివేదిక రిపోర్టు అక్టోబరు 10న ఉన్నతాధికారులకు ఇవ్వడం జరిగిందన్నారు. ప్రియభారతి తల్లి కూరాడ-2 యానిమేటర్ (వీవోఏ)గా పని చేస్తుందన్నారు. ఆమె కూడా డ్వాక్రా సంఘ సభ్యుల డబ్బులు బ్యాంకుకి జమచేయకపోవడం, కుమార్తె ప్రియభారతికి సహకరించిందన్నారు. ఆమె చేసిన అక్రమాలు, అవకతవకలు కూరాడ -వీవోఏ ఆలపాటి బేబీ, చినమామిడాడ వీవోఏ ఆచంట మాధవికు తెలిసినా చెప్పకుండా సహకరించినట్లు విచారణలో తేలిందన్నారు. కూరాడ-1లో 28 సంఘాలకు చెందిన పొదుపు,రుణం సొమ్ము రూ.31,47,300, కూరాడ-2లో 32 సంఘాల రూ.57,53,240, చిన మామిడాడకు చెందిన 14 సంఘాలకు 10,85,900 వెరసి మొత్తంగా రూ.99,86,440 సొంతానికి వాడేసుకున్నట్లు విచారణలో నిర్ధారణ చేయడం జరిగిందని తెలిపారు.

నిండుకుండలా...

ఏలేరు జలాశయం

దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీరు విడుదల


ఏలేరు జలాశయం

ఏలేశ్వరం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయం నిండుకుండలా మారింది. ప్రాజెక్టు నుంచి 3000 క్యూసెక్కుల నీటిని శనివారం విడుదల చేశారు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరిగాయి. మరో 4 రోజుల పాటు వర్షాలు పడే సూచనలతో ఎగువ ప్రాతంలో కురిసే భారీ వర్షాలతో ప్రాజెక్టులో వరద నీరు చేరి కొత్తపల్లి, పిఠాపురం, గొల్లప్రోలు, కిర్లంపూడి, ప్రత్తిపాడు, పెద్దాపురం మండలాలకు ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని కిందకు విడుదల చేస్తున్నారు. ఏలేరు ప్రాజెక్టులో శనివారం 86.56 మీటర్లకుగాను 85.57 మీటర్లు, 24.11 టీఎంసీలకు గాను 22.10 టీఎంసీలు నీటి నిల్వలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు నీటిని, దిగువ ప్రాంతాలకు 3000 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో పిఠాపురం యువకుడికి కాంస్య పతకం


కాంస్య పతకం సాధించిన సురేష్‌కుమార్

పిఠాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో కాకినాడ జిల్లా పిఠాపురం బొజ్జా వారి తోటకు చెందిన కేతినీడి సురేష్‌కుమార్ కాంస్య పతకం సాధించాడు. ముంబైలోని జస్వంత్‌రావు చౌహాన్ సెంటర్‌లో వరల్డ్ నేచురల్ బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన పోటీల్లో సురేష్‌కుమార్ పాల్గొన్నాడు. ఓపెన్ ఫిజిక్ కేటగిరీలో జాతీయస్థాయిలో మూడో స్థానంలో నిలిచాడు. పలువురు అభినందించారు.

నవంబరు 10, 11 తేదీల్లో
'నన్నయ' అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నన్నయ విశ్వవిద్యాలయం వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పురుషుల, మహిళల చాంపియన్‌షిప్, విశ్వవిద్యాలయ జట్టు ఎంపికలు నవంబరు 10,11 తేదీల్లో నిర్వహించనున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. దీనికి సంబంధించి బ్రోచర్‌ను శనివారం ఆమె ఆవిష్కరించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. అతిపెద్ద క్రీడా కార్యక్రమమైన దీనిని సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్ట్స్ కళాశాల వ్యాయామ అధ్యాపకులకు తెలిపారు. అథ్లెటిక్స్‌లో మొత్తం 26 క్రీడాపోటీలు ఉంటాయని, సమష్టిగా కృషి చేసి పోటీలను విజయవంతం చేయాలని సూచించారు. ప్రిన్సిపాల్ రామచంద్రరావు ఆర్‌కే మాట్లాడుతూ కళాశాలలోని అన్ని విభాగాలు, పూర్వ విద్యార్థుల సహాయ సహకారాలతో అథ్లెటిక్ పోటీలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు. నన్నయ వర్శిటీ పరిధిలోని క్రీడాకారులంతా పాల్గొనాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, క్రీడాబోర్డు సహాయ కార్యదర్శి ఎంవీఎస్ఎస్ఎన్ మూర్తి, కార్యనిర్వాహక సభ్యులు ఎం.ప్రసాద్, పీవీవీ లక్ష్మి, టి.విజయదుర్గ ఉన్నారు.

భీమేశ్వరాలయంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి


భీమన్న (ఫైల్)

ద్రాక్షారామ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం ద్రాక్షారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శనివారం విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతిచెందాడు. ఆలయంలో కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో రోజు వారీ కూలీకి గార్డెనర్‌గా ద్రాక్షారామానికి చెందిన దొంగల భీమశంకరం (భీమన్న) (46) పనిచేస్తున్నాడు. భీమశంకరుడు, అతడి కుమారుడు గత కొంతకాలంగా ఆలయంలో తోట పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఉత్తర గోపురం దగ్గర గడ్డిని యంత్రంతో కట్ చేస్తూ బోర్లా పడిపోయి ఉన్నాడు. పక్కన కటింగ్ మిషన్ తిరుగుతూనే ఉంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఈవో, సిబ్బంది చూసి పక్కనే ఉన్న ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు.

ఆలయానికి సంప్రోక్షణ

ప్రస్తుతం కార్తీకమాసం కావడంతో ఆలయానికి భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో ఇటువంటి సంఘటన జరగడంతో ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం నుంచి మూసివేసి సంప్రోక్షణ నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి తిరిగి స్వామివారి దర్శనం భక్తులకు కలిగించారు.

నకిలీ పోలీసు అరెస్ట్

బంగారు ఉంగరాలు, గొలుసు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ బాలాజీ

నిడదవోలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): పోలీసు వేషధారణలో ప్రజలను మోసగిస్తూ నేరాలకు పాల్పడుతున్న విశాఖపట్టణానికి చెందిన వ్యక్తిని అరెస్టు చేసిన సంఘటన శనివారం తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో జరిగింది. ఎస్ఐ బాలాజీ సుందరరావు తెలిపిన వివరాల ప్రకారం... నిడదవోలు మండలం శంకరాపురంలో ఈనెల 22న ఒక ఇంట్లో చోరీ చేసి 2 కాసుల బంగారం గొలుసు, ఒక బంగారు ఉంగరం దొంగిలించుకుపోయాడని కాయల మంగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా ఉన్నతాధికారులకు వచ్చిన సమాచారం మేరకు నిందితుడు విశాఖపట్టణం సీతమ్మధారకు చెందిన ఆదిరెడ్డి అప్పారావును అరెస్టు చేసి విచారించగా అతడిపై 14 కేసులు ఉన్నట్లు వెల్లడైందన్నారు. అతడి నుంచి 3 బంగారు ఉంగరాలు, ఒక బంగారు గొలుసు, బొలేరో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీస్ అని చెప్పి ప్రజలను మోసగిస్తుంటాడని తెలిసిందన్నారు. 14 పాత కేసులతో పాటు కోరంగి పోలీస్ స్టేషన్, గోకవరం పోలీస్ స్టేషన్, గండేపల్లి పోలీస్ స్టేషన్, కరప పోలీస్ స్టేషన్, రాజమండి టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో మొత్తం 6 నేరాలు చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. అతడిని కోర్టుకు పంపుతామన్నారు. సమావేశంలో ఎస్ఐ జె.కల్పన సిబ్బంది ఉన్నారు.

కోర్టులో అగ్ని ప్రమాదం

రూ. 4 లక్షల ఆస్తి నష్టం


సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దగ్ధమైన సామగ్రి

కాకినాడ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో శుక్రవారం అర్ధరాత్రి షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు రూ.4 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. వివరాలిలా ఉన్నాయి. శనివారం ఉదయం రోజు మాదిరిగానే కోర్టు తలుపులు తీసి చూడగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగతో కమ్మేసి ఉండడాన్ని సిబ్బంది గమనించి అధికారులకు తెలియజేశారు. కాగా గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్లాబ్ లీకయ్యి వర్షపు నీరు కోర్టు హాలులో పడడంతో కరెంట్ షార్ట్ సర్క్యూట్ అయి ఉండవచ్చని సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు తెలిపారు. న్యాయమూర్తి ఆశీనులయ్యే ప్రాంతంలోనే షార్ట్ సర్క్యూట్ సంభవించి కంప్యూటర్, ప్రింటర్‌టేబుల్, కుర్చీల నుంచి 3 ఏసీలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. మరో 4 ఏసీలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అలాగే కోర్టు హాలు స్లాబ్, గచ్చు కూడా ధ్వంసమైంది. వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు బృందం ఘటనా స్థలిని పరిశీలించి అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

కోడిగుడ్ల వ్యాన్‌ను ఢీకొన్న లారీ

పెద్దాపురం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురం ఏడీబీ రహదారిలో పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సమీపంలో కోడిగుడ్ల లోడ్‌తో వెళ్తున్న వ్యాన్‌ను వెనుక నుంచి లారీ ఢీకొంది. ఎగ్ ట్రేలు భారీగా కిందపడి వేలాదిగా కోడిగుడ్లు చితికిపోయాయి. లారీ క్యాబిన్‌లో డ్రైవర్ ఇరుక్కుపోవడంతో పోలీసులు క్యాబిన్ నుంచి బయటకు తీసి స్థానిక ఆసుపత్రికి తరలించారు.


రోడ్డుపై వ్యాన్ నుంచి పడి చితికిన కోడిగుడ్లు

నేడు 'కవిసంధ్య' దశాబ్ది ఉత్సవం

- యానాంలో సాహితీ పురస్కారాల ప్రదానం
- హాజరుకానున్న మల్లాడి, మండలి బుద్ధప్రసాద్
- పద్మశ్రీ కొలకలూరి ఇనాక్‌కు శిఖామణి జీవన సాఫల్య పురస్కారం
- యువ పురస్కారం, పది మందికి ప్రతిభా పురస్కారాలు

యానాం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వార్తలు, విశేషాలు, విశ్లేషణలకు పత్రికా మాధ్యమమే ప్రధాన స్రవంతి. సామాజిక చైతన్యానికి కరదీపికలుగా ఈనాటికీ పత్రికలే వెలుగొందుతున్నాయి. సాహిత్య సంపదకూ పత్రికలే పట్టుగొమ్మలయ్యాయి. ఇక కేవలం సాహిత్యమే ప్రధానంగా నడిచే పత్రికలు తెలుగునాట అనేకం ఉన్నాయి. కొత్త కవులకు, రచయితలకు ఇవే తొలి పరిచయ వేదికలు.. పదేళ్ల కిందట ఈ సాహిత్య ప్రక్రియను ముందుకు తీసుకెళ్లే క్రమంలో 'కవిసంధ్య' కూడా సాహితీ ప్రపంచంలోకి అడుగుపెట్టింది. ప్రముఖ కవి శిఖామణి ఈ కవిసంధ్యకు సంపాదకుడు. కవిత్వం, దానికి అనుబంధంగా కవిత్వపు ధోరణులు, చర్చ, విమర్శలకు మాత్రమే ఇది వేదిక. సాహిత్యంలోనే అనేక ప్రక్రియలను మిళితంగా చేసుకుని పత్రిక నిర్వహించడం వేరు. ఇలా నిర్దేశిత పరిమితులతో ఒకే అంశానికి పరిమితమై ముందుకుసాగడమంటే కత్తిమీద సామే. అయినా సరే, అన్ని సవాళ్లను దాటుకుని పది వసంతాలను కవిసంధ్య పూర్తిచేసుకుని కేంద్ర స్థానం యానాంలో వేడుకను జరుపుకుంటోంది. కవిసంధ్య, సాహిత్య సాంస్కృతిక సంస్థ యానాంలో ప్రతీ ఏటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రధాన సభతోపాటు ఈసారి కవిసంధ్య దశాబ్ది ఉత్సవం ఆదివారం జరగనుంది. యానాం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణమండపంలో ఈ సభ ఏర్పాటు చేశారు. కవిసంధ్య రథసారథి, కళారత్న డాక్టర్ శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరవుతారు. శిఖామణి జీవన సాఫల్య పురస్కారం-2025ను ప్రముఖ కవి, రచయిత, సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్, యువ పురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబు స్వీకరించనున్నారు. వివిధ సాహిత్య ప్రక్రియలతోపాటు పత్రికారంగానికి సంబంధించి మొత్తం పది మందికి కవిసంధ్య ప్రతిభా పురస్కారాలు అందజేస్తారు.

ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఎమ్మెల్యే, తెలుగుభాషా సంస్కృతుల ప్రేమికుడు మండలి బుద్ధప్రసాద్, ప్రముఖ పద్యకవి ఆజోవిభో కందాళం ఫౌండేషన్ అధ్యక్షుడు ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ, ప్రముఖకవి రచయిత దాట్ల దేవదానంరాజు, ప్రముఖ సాహితీవేత్తలు మధునాపంతుల సత్యనారాయణమూర్తి, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, డాక్టర్ కాళ్లకూరి శైలజ, బొల్లోజుబాబా, కుంచే నాగసత్యనారాయణ, సీహెచ్ రాం, డాక్టర్ గూటం స్వామి తదితరులు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కవిసంధ్య- ఆరుద్ర, బైరాగి శత జయంతి సంచిక ఆవిష్కరణ జరగనుంది.

కొవ్వూరులో వారాహి అమ్మవారి ఆభరణాల తనిఖీ

4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు గుర్తింపు


ఆభరణాలను తనిఖీ చేస్తున్న అధికారులు

కాకినాడ రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయంలో ఉన్న ఆభరణాలను దేవదాయ, ధర్మదాయశాఖ ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి, కృష్ణాజిల్లాల జ్యూయలరీ తనిఖీ అధికారి విళ్ల పల్లంరాజు శనివారం పరిశీలించారు. ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్.సౌజన్య వారాహి అమ్మవారి ఆభరణాలను అధికారికి అందజేయగా కూటమి నాయకులు కరెడ్ల గోవిందు, రవి, గ్రామ పెద్దల సమక్షంలో తనిఖీ నిర్వహించారు. మొత్తం 4.3 మిల్లీ గ్రాముల బంగారం, 3.5 కిలోల వెండి ఉన్నట్టు అధికారులు గుర్తించి వాటి వివరాలను అధికారికంగా రిజిస్టర్‌లో నమోదచేశారు. జేవీవో మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు 15 కంటే ముందు ఎవరైనా ఆలయానికి ఆభరణాలు ఇచ్చి ఉంటే వాటి వివరాలను తమకు తెలపాలని, వాటిని మాత్రమే దేవదాయ శాఖ రికార్డులో నమోదు చేసి అమ్మ వారికి అలంకరించడం జరుగుతుందని సూచించారు. అనంతరం ఆలయం వద్ద నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణను పరిశీలించి దాతల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు సహకారమందిస్తానని తెలిపారు. ఆభరణాల తనిఖీలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

'స్పందన'లో రూ.1.44 లక్షలు మాయం

ఆరుగురిపై కేసు నమోదు

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం ఎర్రవంతెన వద్ద ఉన్న స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్‌లో రూ.1.44లక్షలు నగదు మాయం చేసిన ఆరుగురిపై శనివారం అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు కేసు నమోదు చేశారు. స్పందన ఫైనాన్స్ కార్పొరేషన్‌లో లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న వారి బండారం ఆడిట్‌లో బయటపడింది. స్పందన మేనేజర్ పలివెల వినోద్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు లోన్ రికవరీ అధికారులుగా పనిచేస్తున్న కాసా కార్తీక్, గెడ్డం కుమార్, దాసరి విష్ణుప్రకాష్, కోసూరి గోపి, కోసూరి ప్రేమ్‌కుమార్, చిన్నారావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు పేర్కొన్నారు.

భారీ తాచుపాము కలకలం

అల్లవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి పర్వదినాన డి.రావులపాలెంలో ఐదు అడుగుల భారీ తాచుపాము కలకలం రేపింది. బీమా సత్తిరాజు ఇంట్లోకి చొరబడ్డ తాచుపాముతో వారు ఆందోళనకు గురయ్యారు. స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మ అక్కడకు చేరుకుని చాకచక్యంగా తాచుపామును బంధించి సురక్షిత ప్రాంతంలో వదిలిపెట్టారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

అమలాపురంరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): అంటు వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం పేరూరుప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది అలసత్వంవహిస్తే చర్యలు తప్పవన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు


అమలాపురం: బండారులంకలో పుట్టవద్ద పూజలు చేస్తున్న భక్తులు

అమలాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నాగులచవితిని పురస్కరించుకుని శనివారం అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాల్లోని పాముల పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో ఆవుపాలు పోసి చలిమిడి, చిమ్మిలి, తేగలు, బుర్రగుంజు, కోడిగుడ్లు సమర్పించారు. ఆలయాల వద్ద జంట నాగులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇటీవల వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో భక్తులు రాగిడి నేలల్లో జారుతూ వెళ్లి మరీ పుట్టల వద్ద పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. బండారులంకలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులతో పాటు పలువురు పాల్గొన్నారు.

ముమ్మిడివరం,(ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రజలు జరుపుకున్నారు. ఉదయాన్నే పుణ్యస్నానాలు ఆచరించి పుట్టలో పాలుపోసి నాగేంద్రునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలు, తేగలు, బుర్రగుంజు, కోడిగుడ్లు, చలిమిడి, చిమ్మిలి నాగేంద్రునికి నైవేద్యంగా సమర్పించారు. ప్రజలు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలకు వెళ్లి నాగ ప్రతిమలకు పూజలుచేసి ప్రత్యేక అర్చనలు జరిపించుకున్నారు.సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు, పొలాల్లోని పుట్టల వద్ద భక్తులు కిక్కిరిశారు.

పి.గన్నవరం,(ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రతి గ్రామంలో భక్తులు పంట పొలాల్లోఉన్న పుట్టలు వద్దకు వెళ్లి పాలు, గుడ్లు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొండెపులంక, లంకల గన్నవరం, పి.గన్నవరం నూతన అక్విడెక్టు వద్ద ఉన్న పుట్టలకు భక్తులు పోటెత్తారు. అక్విడెక్టు వద్ద భారీఅన్నసమారాధన నిర్వహించారు. కుందాలపల్లి,పి.గన్నవరం, మొండెపులంక శివాలయాలు వద్ద వేంచేసిఉన్న శ్రీవల్లిదేవసేనసమేత సంతాన నాగసుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామగ్రామాన శనివారం నాగులచవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా రైతు కుటుంబాలు పొలాల్లో పాము పుట్టలకు పూజలు నిర్వహించారు. పాముల పుట్టలను రంగవల్లులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయాల్లో పూజల అనంతరం పాముల పుట్టల్లో పాలు పోసి తమను సర్వదా చల్లగా చూడాలని వేడుకున్నారు. మహిళలు, చిన్నారులు, యువత అధిక సంఖ్యలో పూజలకు హాజరయ్యారు. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, ఎస్.యానాం, భీమనపల్లి,విలసవిల్లి, వాడపర్రు, కూనవరం, ఎస్.కొత్తపల్లి, చినగాడవిల్లి, పెదగాడవిల్లి, వానపల్లిపాలెం, పేరాయిచెరువు, చల్లపల్లి, సరిపల్లి, గోపవరం గ్రామాల్లో పొలాల్లోని పాముల పుట్టల వద్ద సందడి నెలకొంది.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): నాగులచవితి పర్వదినాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శనివారం మండలంలో భక్తులు పుట్టలో పాలు, గుడ్లు, చిమిలి, నైవేద్యాలు సమర్పించి నాగదేవతను పూజించారు. పుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పుట్టలవద్దబాణసంచా కాల్చారు.సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లోఉదయం నుంచి అభిషేకాలు, అర్చనలు జరిగాయి.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): భక్తులు భక్తిశ్రద్ధలతో నాగులచవితిని శనివారం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నాగులచవితి వేడుకలను ఘనంగా నిర్వహించారు.పొలాల్లో, ఆలయాల్లో ఉన్న పాము పుట్టల్లో పాలు, గుడ్లు, చలివిడి, చిమిలి వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాచవరం, పుల్లేటికుర్రు, ఇరుసుమండ, గంగలకుర్రు అగ్రహారం గ్రామాల్లోని వల్లిదేవ సేన సుబ్రహ్మణేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాయి. కార్తీకమాసం సందర్భంగా మండలంలోని గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

అల్లవరం (ఆంధ్రజ్యోతి):మండలంలో శనివారం నాగులచవితి సందర్భంగా పూజలు ఘనంగా జరిగాయి. గ్రామాల్లోని కొబ్బరి తోటలు, కాల్వల గట్లపైన ఉన్న పాముల పుట్టల వద్ద మహిళలు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. బోడసకుర్రు, గుడ్డివానిచింత, కొమరగిరిపట్నం గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయాలను భక్తులు సందర్శించి పూజలు చేశారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): కుండలేశ్వరం, చెయ్యేరు, కాట్రేనికోన, లక్ష్మీవాడ, పల్లంకుర్రు, కొత్తపాలెం గ్రామాల్లో సుబ్రమహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లె, ఉప్పూడి, బంటుమిల్లి, చిర్రయానాం, నడవపల్లి, గెద్దనపల్లి, కొప్పిగుంట, దొంతికుర్రు, పల్లం, కందికుప్ప, బలుసుతిప్పల్లో భక్తులు పాముల పుట్టల వద్ద పూజలు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో మొక్కులు తీర్చుకున్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయంలో నాగ ప్రతిమలకు శనివారం భక్తులు పూజలు చేశారు. మురమళ్ళ పితానివారిపాలెంలో సమరసత సేవాఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలు పుట్టలో పాలు, గుడ్లు వేసి నాగదేవత ఆశీస్సులు పొందారు. ఆయా కార్యక్రమాల్లో అర్చకుడు పేటేటి శ్యామలకుమార్, ధర్మప్రచారక్ బొంతు కనకారావు తదితరులు పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాంలో శనివారం నాగులచవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గణపతినగర్, మెట్టకుర్రు, రమాభాయినగర్, గోపాల్‌నగర్, కనకాలపేట, యానాం టౌన్, భీమ్‌నగర్, అంబేద్కర్‌నగర్, ఫరంపేట దరియాలపత్రి తదితర ప్రాంతాల్లో మహిళలు పుట్టలను పసుపు, కుంకుమ, పూలతో అలంకరించారు. పిల్లలు, పెద్దలు, పుట్టల్లో పాలు, గుడ్లు వేశారు. నువ్వులు, చిమిడి, వడపప్పు నివేదన చేశారు. అనంతరం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో నాగులచవితి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తాటిపాకలో పుట్టల వద్ద నాగదేవతకు నైవేద్యంగా టీడీపీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య పాలు, గుడ్లు సమర్పించి పూజలు చేశారు. ఈ సందర్భంగా అమూల్య మాట్లాడుతూ నాగదేవత అనుగ్రహంతో ప్రజలకు సకల శుభాలు కలగాలన్నారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు, నాగులపుట్టలు భక్తుల పూజలతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు జరిగాయి.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో నాగులచవతి సందర్భంగా భక్తులు పుట్టల వద్ద పాలు, గుడ్లు, తేగలు, చిమ్మిలి నైవేద్యాలుగా సమర్పించి పూజలు చేశారు. సఖినేటిపల్లిలంక సుంకరేవు, రామేశ్వరం, గుడిమూల, అంతర్వేదిదేవస్థానం, అంతర్వేదిచెరువుగట్టు సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం, కేశవదాసుపాలెం తదితర గ్రామాల్లో నాగులచవితి వేడుకల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): నాగులచవితి వేడుకలను భక్తులు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు పుట్టల్లో పాలు పోసి నైవేద్యంగా కోడిగుడ్లను సమర్పించి ప్రత్యేక పూజ నిర్వహించారు. తేగలు, చిమిలి, చలిమిడి, బుర్రగుంజు తదితర పదార్థాలను నాగేంద్రుడికి సమర్పించారు. చిన్నారులు పాముల పుట్టల వద్ద బాణసంచా కాల్చి సందడి చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో గల పాముల పుట్టల వద్ద భక్తుల సందడి కనిపించింది. వివిధ గ్రామాల్లో గల సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు.

ఇన్‌సర్వీసు టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపి మూర్తి

అమలాపురం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ వేయించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అమలాపురంలోని ఎంప్లాయిస్ హోంలో శనివారం జరిగిన యూటీఎఫ్ జిల్లాశాఖ ప్రతినిధుల కార్యవర్గ సమావేశంలో గోపి మూర్తి మాట్లాడారు. ఉపాధ్యాయులకు పని ఒత్తిడి తగ్గించి విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. యాప్‌ల విధానాన్ని రద్దు చేయడంతో పాటు పరీక్షల మూల్యాంకన విధానాన్ని సరళీకృతం చేయాలన్నారు. బోధనేతర పనులన్నీ రద్దు చేయాలన్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీల్లో రిలీవర్ లేక నిలిచిపోయిన బదిలీ ఉపాధ్యాయులను వర్కు ఎడ్జెస్ట్‌మెంట్, మరో విధంగానైనా సరే ఆయా ఖాళీలను భర్తీచేసి వెంటనే రిలీవ్ చేయాలన్నారు. ప్లస్-2 హైస్కూళ్లలో తగినతంత మంది ఫ్యాకల్టీలు లేక బోధన కుంటుపడుతుందని, వెంటనే అర్హత గల స్కూల్ అసిస్టెంట్లను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. అన్ని మేనేజ్‌మెంట్లలో ఖాళీగా ఉన్న లాంగ్వేజ్ అసిస్టెంట్ పోస్టులను అర్హత గల లాంగ్వేజ్ పండిట్లకు పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిచర్ల టీవీఏఎస్ సుబ్బారావు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంకే వెంకటేశ్వరరావు, జిల్లా, రాష్ట్ర నాయకులు బీఎస్ శివకుమార్, బీఎస్ వెంకటేశ్వరరావు, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

బేడ బుడగ జంగాలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలివ్వాలి


సంఘీభావం తెలుపుతున్న దృశ్యం

పి.గన్నవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): బేడ బుడగ జంగాలకు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని బేడ బుడగ జంగాల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పేర్ల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. పి.గన్నవరం సిద్ధార్థ కళాశాల ఆవరణలో శనివారం జరిగిన బేడ బుడగ జంగాల పోరాట సమితి జిల్లా సమావేశం పోరాట సమితి నాయకుడు ముగ్గ యేసుదాసు అధ్యక్షతన జరిగింది. ఈసమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేసినప్పటికి కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపించారు. జేసీశర్మ ఏకసభ్య కమిషన్ ఇచ్చిన రిపోర్టును పరిగణలోకి తీసుకుని ఎస్సీ కులాలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బేడ బుడగ జంగాలకు ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు అమలుకావడం లేదని మానవ హక్కులవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు ముత్యాల శ్రీని వాసరావు ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో పి.పవన్, తాడి రాంబాబు, ముగ్గ నాగేశ్వరరావు, పేర్ల నాగ రాజు, చెన్నూరి వెంకటర మణ, ముగ్గ శ్రీనివాస్, ముగ్గ పిచ్చయ్య, ఇంగువ కొండయ్య, ముగ్గ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంపు నీరు తొలగింపునకు చర్యలు: ఎమ్మెల్యే దేవ


ముంపునీటిలో బాధితులను పరామర్శిస్తున్న దేవ

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గం జిల్లాకు శివారు ఉండడంతో సమస్యలతో కొట్టుమిట్టాడుతోందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. శనివారం నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. లోతట్టు ప్రాంతం కావడంతో ముంపునీరంతా మనవద్దకే చేరుతుందని, సుమారు నాలుగు వేల టీఎంసీల ముంపునీరు సముద్రంలో కలుస్తుందన్నారు. రాజోలు నియోజకవర్గంలో శంకరగుప్తం డ్రెయిన్‌ను డ్రెడ్జింగ్ చేసి 10కిలోమీటర్ల మేర గట్లను ఎత్తుచేస్తే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుందన్నారు. కరవాక-గోగన్నమఠం మధ్య 900మీటర్ల మేర వంతెన స్లూయిజ్‌ను నిర్మిస్తే భవిష్యత్తులో మన ప్రాంతం ముంపు బారిన పడకుండా ఉంటుందన్నారు. నవంబరు మొదటి వారంలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కేశనపల్లి పర్యటన ఉంటుందని, ఆ సందర్భంగా రాజోలు నియోజకవర్గ ముంపు నీటి సమస్యపై ఆయనకు ప్రజెంటేషన్ చేస్తానన్నారు. చింతలమోరి దాసులపుంతలో ముంపునీటి ప్రాంతంలో నివాసం ఉంటున్న బాధితులను పరామర్శించారు. టీడీపీ రాజోలు ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, మలికిపురం ఎంపీపీ ఎంవీ సత్యవాణి, సర్పంచ్‌లు డాక్టర్ రాపాక రమేష్‌బాబు, రాపాక ఆనంద్‌కుమార్, ఎంపీటీసీ జక్కంపూడి శ్రీదేవి, ముప్పర్తి నాని, అడబాల యుగంధర్, బి.సాయిబాబురాజు, గుబ్బల ఫణి, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్ ఉండపల్లి అంజి, తహశీల్దార్ టి.శ్రీనివాసరావు,ఎంపీడీవో సీహెచ్ లక్ష్మీకల్యాణి పాల్గొన్నారు.

ముంపు నీరు మళ్లింపు

రాజోలు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. రాజోలులో పారిశుధ్య పనులను సర్పంచ్ రేవు జ్యోతి, సెక్రటరీ రెహ్మాన్ శనివారం పర్యవేక్షించారు. గ్రామంలో ఉన్న చెత్త కుప్పలు తొలగించి బ్లీచింగ్ పనులు చేపట్టారు. వీధుల్లోని మురికినీటిని తొలగించి శుభ్రం చేశారు. రాజోలు సుందరమ్మ చెరువు నిండిపోయి అక్షర స్కూలు వద్ద రోడ్డుపై నీరు చేరింది. దీంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ జ్యోతి, సెక్రటరీ రెహ్మాన్ స్పందించి ఆయిల్ ఇంజన్లు ఏర్పాటుచేసి రోడ్డుపై నిలిచిన నీటిని పల్లపు ప్రాంతాలకు మళ్లించారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి

అంతర్వేది, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తుఫాను నేపథ్యంలో సఖినేటిపల్లి మండల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు సూచించారు. ఆర్ఐ రామరాజు వీఆర్వోలతో కలిసి పర్యటించి అంతర్వేది తీరప్రాంత గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. అంతర్వేది పల్లిపాలెం మత్స్యకారులు వేటకు వెళ్లరాదని, తుఫాను తీవ్రతను బట్టి సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని సూచించారు.

ఫలించిన చెత్తపై పోరుబాట

జిల్లా ఉన్నతాధికారుల హామీతో దీక్షలు విరమణ

అమలాపురంరూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బండారులంక గ్రామంలో ఏడాది కాలంగా నిలిచిపోయిన చెత్త సేకరణను తిరిగి చేపట్టాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే దీక్షలు శనివారం నాటికి పదో రోజుకు చేరుకున్నాయి. రెండు రోజులుగా జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మితో పాటు పలువురు అధికారులు జరిపిన చర్చలు సఫలమై ఉన్నతాధికారుల హామీతో దీక్షలు విరమించారు. పదో రోజు దీక్షలో గుత్తుల చంద్రకళ ఆధ్వర్యంలో చేపట్టగా ఎంపీటీసీ గుత్తుల జానకీలక్ష్మి, ముషిణి రాజు, కుడుపూడి వెంకటేశ్వరరావు, కె.వీరబాబు, ఇళ్ల స్వప్న, ముషిణి శ్రీప్రియ, గుత్తుల తేజాకుమారి, రాయుడు మంగ, గుత్తుల బాబూరావు దీక్షలో పాల్గొన్నారు. శనివారం సాయంత్రం డీఎల్‌పీవో బొజ్జిరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు శాస్త్రి, రుద్రరాజు ఎస్ఎస్ సూరపరాజు సందర్శించి దీక్షాదారులతో చర్చలు జరిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచనల మేరకు చెత్త సేకరణకు అవసరమైన అన్ని చర్యలు చేపడతామని, సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దాంతో దీక్షను విరమించి శిబిరాన్ని మూసివేశారు. కార్యక్రమంలో నాయకులు అంకం హిమభారతి, కామిశెట్టి శ్రీనివాస్, సరెళ్ల నాగమల్లేశ్వరరావు, పెదపూడి బాబూరావు, కారుపర్తి మల్లేశ్వరరావు, దంగేటి మహేష్ పాల్గొన్నారు.

బాలబాలాజీకి విశేష పూజలు

మామిడికుదురు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం శుద్ధ చవితి శనివారం పురస్కరించుకుని అప్పనపల్లి బాలబాలాజీస్వామివారికి అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ నిర్వహించి ఘనంగా తొలిహారతి ఇచ్చారు. భక్తులు తొలిహారతి స్వీకరించి తన్మయత్వం చెందారు. కార్తీకమాసం శనివారం కావడంతో దేవస్థానం భక్తులతో పోటెత్తింది. కొత్త, పాత ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజాము నుంచి స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. శనివారం స్వామివారిని 4వేల మంది భక్తులు దర్శించుకుని 2,400మంది భక్తులు నిత్యాన్నదాన పథకంలో అన్నప్రసాదం స్వీకరించారని, వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.2,32,607 ఆదాయం వచ్చిందని, సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు తెలిపారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలత్తెకుండా ఏసీ, సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడాపోటీలు ప్రారంభం



యానాం,అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి):పుదుచ్చేరి విద్యాశాఖ పరిధిలోని పాఠశాల క్రీడాకారులకు క్రీడాపోటీలు యానాంలో శనివారం ప్రారంభమయ్యాయి. రెండు రోజులు జరిగే పోటీలకు పుదుచ్చేరి, కారైకాల్, మహే నుంచి 400 మంది క్రీడాకారులు, 50మంది కోచ్‌లు యానాం వచ్చారు. స్థానిక డాక్టర్ వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కోకో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం యానాం విద్యాశాఖ అధికారి పంపన లక్ష్మణప్రవీణ్ అధ్యక్షతన జరిగే ముగింపు పోటీలకు ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, యానాం ఆర్‌ఏ అంకిత్‌కుమార్‌లు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారు.

రక్తదానంతో తల్లీబిడ్డ క్షేమం

అంబాజీపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఇద్దరు గర్భిణులకు రక్తం అవసరం కావడంతో అంబాజీపేటకు చెందిన శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమానికి చెందిన ముగ్గురు రక్తదానం చేసి తల్లీబిడ్డ ప్రాణాలను కాపాడారు. విశాఖలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు కేతా సునీత, వంకాయల దుర్గకు రక్తం అవసరం కాగా యోగాగురువు ఆకుల శ్రీనివాస్‌కు విషయాన్ని వివరించారు. దీంతో ఎల్.సుధీర్, సీహెచ్.గాయత్రినుంచి శ్రీనివాస్ రక్తాన్ని సేకరించి ఇద్దరు గర్భిణులకు అందించారు.

బీవీసీ కళాశాలలో అంతర్జాతీయ హ్యాకథాన్ పోటీలు


ఓడలరేవు బీవీసీలో అంతర్జాతీయ హ్యాకథాన్ కార్యక్రమం దృశ్యం

అల్లవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో ఐఈఈఈ పేరిట 24గంటలు జరిగే హ్యాకథాన్ పోటీలు శనివారం ఉదయం ప్రారంభమయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా జరిగే పోటీల్లో లక్షలాదిమంది ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొంటారని ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మహేశ్వర్ తెలిపారు. బీవీసీ కళాశాలలో జరిగే కార్యక్రమంలో 60మంది ఈపోటీల్లో పాల్గొంటున్నారు. స్టూడెంట్ అంబాసిడర్ అంజని సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ప్రవీణ్, ఎస్.శ్రీకాంత్, టి.శరణ్‌కుమార్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు. వీరిని కళాశాల చైర్‌పర్సన్ బోనం కనకదుర్గ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బోనం కనకయ్యలు అభినందించారు.

కారుపర్తికి పద్మప్రతిభ అవార్డు



మామిడికుదురు,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మొగలికుదురు గ్రామానికి చెందిన ప్రముఖ పంచాంగకర్త, వాస్తు సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావు జాతీయస్థాయి పద్మప్రతిభ అవార్డును అందుకున్నారు. మనం ఫౌండేషన్‌వారు హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో గల శ్రీత్యాగరాయ గానసభ హాలులో జరిగిన సమావేశంలో అవార్డును తనకు అందించినట్టు కోటేశ్వరరావు శనివారం తెలిపారు. మహాత్మాగాంధీ జయంతి, లాల్‌బహదూర్‌శాస్త్రి, ఏపీజెఅబ్దుల్‌కలాం జయంతి సందర్భంగా అవార్డును అందించినట్టు ఆయన తెలిపారు.

ఎల్ఐసీ ఏవోఐ అధ్యక్షుడిగా నాగేంద్రకుమార్

అమలాపురం రూరల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కొంకాపల్లిలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక కమిటీ సమావేశం రాజమహేంద్రవరం డివిజన్ సంఘ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు అధ్యక్షతన శనివారం జరిగింది. సమావేశంలో సూపర్ జీఎస్టీలో భాగంగా ఎల్ఐసీ పాలసీదారులకు చేకూరిన లాభం తదితర అంశాలపై చర్చించారు. అమలాపురం డివిజన్ సంఘ అధ్యక్షుడిగా వీరభద్రరావు ఎన్నిక కావడం పట్ల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. అమలాపురం బ్రాంచి అధ్యక్షుడిగా ఎ.నాగేంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకునేందుకు నిర్ణయించారు. సమావేశానికి ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ కె.సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ మధుబాబు ముఖ్య అతిథులుగా హాజరై ఎల్ఐసీలో వచ్చిన మార్పుల గురించి వివరించారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి జి.వినాయకరావు, కోశాధికారి దొమ్మేటి శివస్వామి, కడలి శ్రీనివాసరావు, కేతా వీరాస్వామి, యడ్ల ఆదినారాయణ, అధికార బాబ్జీ, ఎండీఎస్ గౌడ్ శీలం లంకేష్, బొక్కా వెంకటేశ్వరరావు, ఎల్‌వీవీ లక్ష్మి, దూనబోయిన దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్‌కు ఓఎన్జీసీ నుంచి రూ.5కోట్లు

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గంలో తాగునీటి సమస్య లేకుండా చేయాలన్నదే తన ఆశయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. గుడిమెళ్లంక రక్షిత మంచినీటి పథకంలో ఒకే ఒక ఫిల్టర్ పనిచేస్తుందని, మిగిలిన ఫిల్టర్లు పాడై దశాబ్ద కాలం అయినా గత పాలకులు పట్టించుకోలేదన్నారు. ఓఎన్జీసీ అధికారులతో సంప్రదింపులు జరపగా రాజోలు నియోజకర్గంలోని 98ఆవాసాలకు మంచినీటిని సరఫరా చేసే గుడిమెళ్లంక, సీపీడబ్ల్యుఎస్ స్కీమ్‌కు అదనపు ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయడానికి ఓఎన్జీసీ రూ.5కోట్లు మంజూరు చేసిందన్నారు. రాజమహేంద్రవరం ఓఎన్జీసీ కార్యాలయంలో ఈడీ ఎసెట్స్ మేనేజర్ శంతనుదాస్ అగ్రిమెంట్‌పై సంతకం చేసి మొదటి విడతగా రూ.1.25కోట్లు విడుదల చేశారన్నారు. ఇప్పుడున్న ఫిల్టర్లకు కాలం చెల్లిపోగా ఒకే ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ పనిచేస్తుందన్నారు. ఈఫిల్టర్ చెడిపోతే 98ఆవాసాలకు శుద్ధిచేసిన నీటిని పంపే వీలు ఉండదన్నారు. ఓఎన్జీసీని అడగ్గా మరో అదనపు ర్యాపిడ్ శాండ్ ఫిల్టర్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేసినందుకు తొలివిడతగా రూ.కోటి 25లక్షలు విడుదల చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

తీర ప్రాంత గ్రామాల్లో అలజడి

అంతర్వేది, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వరుసగా కురిసిన వర్షాలతో పాటు రాబోయే తుఫాను నేపథ్యంలో తీర ప్రాంత ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. కూటమి నాయకులు, టీడీపీ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్యతో కలిసి అంతర్వేది, గునిశెట్టివారిపుంత, సెయింట్ మేరీ స్కూలు పరిసర ప్రాంతాలను శనివారం ఆయన పరిశీలించారు. స్థానిక సర్పంచ్ పోతురాజు నరసింహారావు (కిశోర్) ఆయనకు ముంపు ప్రాంతాల్లోని పరిస్థితులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ తీర ప్రాంత గ్రామాలు ముంపునకు గురికాకుండా తాత్కాలిక పరిష్కారాలతో పాటు శాశ్వత పరిష్కార దిశగా అడుగులు వేయాలన్నారు. తీర ప్రాంత ప్రజలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుబ్బల ఫణికుమార్, గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, మాలే శ్రీనివాసనగేష్, పోతురాజు సురేష్, చొప్పల బాబూరావు, బైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, తాడి సత్యనారాయణ, రావూరి నాగు, దాసరి వాసు, సరాగుల రాజారత్నం, అడపా రాంబాబు, సాయిబాబురాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల ర్యాలీ

అల్లవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): బోడసకుర్రులో శనివారం రాత్రి పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఎస్ఐ బి.సంపత్‌కుమార్ పర్యవేక్షణలో పోలీసు అమరవీరుల ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మండల తెలుగు యువత అధ్యక్షుడు ముత్యాల బాబి, టీడీపీ నాయకుడు అరవ చంటి, దొమ్మేటి రామకృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి చేయాలని వినతి

అల్లవరం అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చమురు, సహజ వాయు నిక్షేపాల తరలింపులో అగ్రగామిగా ఉన్న బోడసకుర్రులో దేవర్లంక ఓఎన్జీసీ టెర్మినల్‌కు వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైందని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో గ్రామస్తులు ఓఎన్జీసీ సైట్ ఇన్‌చార్జి ప్రశాంత్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. బోడసకుర్రు దేవిసెంటర్ నుంచి దేవర్లంక ఓఎన్జీసీ టెర్మినల్ వరకు పాడైన రోడ్డును యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, గ్రామస్తులు కోరారు.

అన్నప్రసాద ట్రస్టుకు రూ.1.15లక్షల విరాళం

మామిడికుదురు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీస్వామివారి అన్నప్రసాద ట్రస్టుకు ఒకరోజు ఉదయం 2400మంది భక్తులకు అన్నప్రసాద వితరణ జరిపించాలని కోరుతూ పాశర్లపూడి గ్రామానికి చెందిన కటికిరెడ్డిరామకృష్ణ-ఆదిలక్ష్మి దంపతుల కుమారులు రూ.1,15,200 విరాళంగా అందించారు.

అన్నప్రసాద ట్రస్టుకు విరాళం

అయినవిల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన దార్లంక గంగాధరరావు-రాజేశ్వరి దంపతులు శనివారం అయినవిల్లి శ్రీసిద్ధివినాయకస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.25,111 విరాళం సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఆశీర్వచనం అందజేసి శేష వస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందించారు.

మానేపల్లిలో కోటి సంతకాల సేకరణ

పి.గన్నవరం, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ మానేపల్లిలో వైసీపీ మండల అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో కోటి సంతకాలు సేకరణ, రచ్చబండ కార్యక్రమాలు నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో సంతకాలు సేకరించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, మందపాటి కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్ పితాని చంద్రకళ పాల్గొన్నారు.

భద్రాచలానికి మోరి అయ్యప్పస్వాములు

మలికిపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మోరి పేరాబత్తుల సుబ్బారాయుడుస్వామి పీఠానికి చెందిన అయ్యప్పస్వాములు శనివారం భద్రాచలం రాముడిని దర్శించుకునేందుకు వెళ్లారు. స్వామివారి పల్లకీ సేవలో పోతురాజు రాజు, నాగిరెడ్డి మధు, కటికిరెడ్డి శ్రీనివాసరావుస్వామి, మూర్తిస్వామి, బ్రహ్మజీస్వామి, వేమన రాజ పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో భక్తుల రద్దీ

అయినవిల్లి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): నల్లచెరువులో గల శ్రీపద్మావతి, అలివేలు మంగా సమేత శ్రీవేంకటేశ్వరాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. కార్తీకమాసం శనివారం సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు.

తుఫాన్‌పై అధికారులు అప్రమత్తంగా ఉండాలి

యానాం,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):మొందా తుఫాన్‌పైఅధికారులు అప్రమత్తంగా ఉండాలని పరిపాలనాధికారి అంకిత్‌కుమార్ అన్నారు. ఈమేరకు తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈతుఫాన్ ప్రభావం యానాంపై ఉండే అవకాశం ఉందని, ప్రజలు, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిపాలనాధికారి కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. తుఫాన్ నేపథ్యంలో అత్యవసర సేవలకు 0884-2321223, 2323200, టోల్‌ఫ్రీ నెంబరు 18004252303కి సంప్రదించాలన్నారు. రెవెన్యూ, మున్సిపాల్టీ, ప్రజాపనులశాఖ, ఆరోగ్య, విద్యా, పోలీస్, ఫైర్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌ను పరిపాలనాధికారి కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. యానానికి సంబంధించిన అంశాలపై చర్చించారు.

అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

ముమ్మిడివరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మొదటి శనివారం ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెంలోని శ్రీహరిసాకేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఏడు శనివారాలు ఏడు ప్రదక్షిణలు మొక్కులు తీర్చుకునే భక్తులతో ఆలయ ప్రాంగణమంతా కిటకిటలాడింది. సువర్ణ పుష్పాలతో అష్టోత్తర శతనామావళి పూజ, ఆకాశ దీపారాధన పూజ, స్వామివారికి విశేషాలంకరణ, సప్త హారతులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు కొండవీటి ఆదిత్యశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న అరుణాచలేశ్వరుని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అరుణగిరి చుట్టూ దశ శివలింగాలు, మధ్యలోని అపితకుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామికి ప్రత్యేక అర్చనలు జరిపించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

'ఎమ్మెల్యే కొలికపూడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి'

ఐ.పోలవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వైసీపీకి కోవర్టుగా మారి కూటమి ప్రభుత్వంపై, టీడీపీపై విమర్శలు చేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును పార్టీ నుంచి బహిష్కరించాలని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు(బాలు) అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు కొలికపూడిని కోవర్టుగా వాడుకుంటున్నారని ఆరోపించారు. టీడీపీ జాతీయఅధ్యక్షుడు చంద్రబాబు, రాష్ట్రఅధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొలికపూడిపైచర్యలు తీసుకోవాలన్నారు.



వెండిపుట్టలో దర్శనమిచ్చిన ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

నాగుల చవితిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సమీపంలోని పుట్టల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులు బాణసంచా కాలుస్తూ సందడి చేశారు

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నాగులచవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచే మహిళలు పుట్ట వద్దకు చేరుకుని పూజలు చేశారు. మండలంలోని చెముడులంకలో ఉన్న సంతాన నాగమ్మ పుట్ట వద పలువురు భక్తులు పూజలు జరిపారు. గుమ్మిలేరులోని ఉరదాలమ్మ ఆలయం వద్ద ఉన్న పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): నాగులచవితి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వేకువజామునే కుటుంబ సభ్యులతో పుట్టవద్దకు చేరుకుని పాలుపోశారు. ఆయా ప్రాంతాల్లోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

రాయవరం(ఆంధ్రజ్యోతి): మండలంలోనా గులచవితి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఉన్న పుట్టల వద్ద ప్రత్యేక పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. చిన్నారలుఉ బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న పుట్టల వద్ద అర్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్య ంలో భక్తులు పుట్ట వద్ద పూజలు చేశారు. అనంత రం సోమేశ్వర



ఆలమూరు మండలం చెముడులంక సంతాన నాగమ్మ పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

స్వామిని, అమ్మవారిని దర్శించుకున్నారు. వెదురుపాక తుల్యభాగ డ్రైన్ సమీపం లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, రాయవరం నాగమ్మపుట్ట, మండలంలోని పసలపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తు లు వేకువజాము నుంచే బారులుతీరారు. శివాలయాలు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో



రాయవరం మండలం పసలపూడిలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

భక్తుల రద్దీ నెలకొంది.

విజయదుర్గా పీఠంలో: మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో నాగుల చవితిని పురస్కరించుకుని కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి, అభిషేకాలు ప్రత్యేక పూజలు జరిపారు. ఈ పూజల్లో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, గాడ్ కుమార్తెలు బి.రమ, గాదే సత్య వెంకటకామేశ్వరి, భాస్కరనారాయణ, పెద సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో వాడ్రేవు వేణుగోపాల్, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం(ఆంధ్రజ్యోతి): మండలంలో నాగులచవితిని ఘనంగా నిర్వహించారు. ఆత్రేయపురంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండి పుట్టలో భక్తులకు దర్శనమిచ్చారు. పుట్ట వద్ద భక్తులు పాలుపోసి నాగేంద్రుడికి నైవేద్యం సమర్పించారు. మెర్లపాలెం కనకదుర్గమ్మ ఆలయం గుడివెనుక పుట్ట వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు కిటకిటలాడాయి.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆయా పుట్టల వద్ద భక్తులు పాలుపోసి పూజలు చేశారు. చిన్నారులు బాణసంచా కాల్చి సందడి చేశారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శనివారం నాగులచవితిని ఘనంగా జరిపారు. అంగర, పడమరఖండ్రిక, కపిలేశ్వరపురం, వల్లూరు, కాలేరు తదితర గ్రామాల్లో భక్తులు వేకువజామునే పుట్టల వద్ద చేరుకుని పూజలు చేశారు. చిన్నారులు పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం నాగుల చవితిని భక్తి శ్రద్ధలతో జరిపారు. ఆయా గ్రామాల్లోని పుట్టల వద్ద భక్తులు పూజలు చేశారు. పిల్లలు ఆయా పుట్టల వద్ద టపాసులు కాల్చారు.

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): నాగుల చవితి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. భక్తులు సమీపంలోని పుట్టల వద్ద పూజలు చేశారు. యువకులు ఆయా పుట్టల వద్ద బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. ఆయా గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు పూజలు జరిపారు.



కె.గంగవరంలో పుట్టలో పాలు పోస్తున్న మహిళలు

సోమేశ్వర ఆలయంలో మంత్రి సుభాష్ పూజలు

కె.గంగవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి ఛాయాసోమేశ్వరస్వామిని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో భీమశంకరం, అర్చకులు, ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం బేడా మండపంలో పండితులు మంత్రికి వేదాశీర్వాదం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు వెంటూరు వీర్రాఘవులు చౌదరి, గొడవర్తి రామకృష్ణ చౌదరి, చీకట్ల సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



సోమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి సుభాష్

జనార్దనస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా భక్తజనం ప్రత్యేక పూజలు జరిపారు. కార్తీకమాసం శనివారం పర్వదిన సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ బైరిశెట్టి రాంబాబు, ఇతర డైరెక్టర్లు ఆయా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రత్యేక అలంకరణలో స్వామివారు →





మండపల్లి శనేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మండపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనాలు, తైలాభిషేకాలకు భక్తజనం బారులుతీరారు. ఆలయ ప్రాంగణంలో పలువురు భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. అన్నప్రసాద వితరణ నిమిత్తం చిలకమర్తి వెంకట సూర్యసుబ్రహ్మణ్య శ్రీనివాస్, అనంత లక్ష్మిసావిత్రి వారి కుమార్తె ఐశ్వర్య భారతి పేరున రూ.27వేలు విరాళంగా అందించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి రూ.91,830 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్లు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబు తెలిపారు.





ప్రత్యేక అలంకరణలో వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి. పక్క చిత్రంలో తిరువీధుల్లో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

శ్రీనివాస గోవింద..

• వాడపల్లికి పోటెత్తిన భక్తులు • స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.42 లక్షలు

ఆత్రేయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తజనం పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్ర పుష్పం, ఐశ్వర్యలక్ష్మీ హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలు నిర్వహించి స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు చెల్లించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదంలో పాల్గొన్నారు. రాత్రి సమయంలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.42.01 లక్షలు లభించినట్టు ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

పార్కింగ్ వద్ద బురదతో పాట్లు: వాడపల్లి ఆలయానికి వచ్చే దూర ప్రాంత భక్తులకు లొల్లరజకపేట మీదుగా శ్రీరామ్‌నగర్ సమీపంలోని నాలుగు చక్రాల వాహనాలకు నూతన పార్కింగ్‌ను ఏర్పాటు చేశారు. నాలుగు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పార్కింగ్ బురదగా మారింది. ఏటిగట్టు సమీపంలోని నాలుగు ఎకరాల్లో ఉన్న ఈ పార్కింగ్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించినా కార్యరూపం దాల్చలేదు. ఈ నేపథ్యంలో సుమారు రూ.20లక్షలతో కారు పార్కింగ్‌ను ఎర్ర గ్రావెల్‌తో ఫిల్లింగ్ చేశారు. దీంతో ఇటీవలి వర్షాలకు బురదగా మారడంతో భక్తులు అనేక ఇబ్బందులు పడ్డారు. భక్తులు బురదలో నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

జన సైనికుడి కుటుంబానికి మంత్రి దుర్గేష్ పరామర్శ

ఆలమూరు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): చెముడులంకకు చెందిన సిద్దిరెడ్డి గణేష్ మృతి పట్ల మంత్రి కందుల దుర్గేష్ సంతాపం వ్యక్తం చేసి వారి కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించారు. కడియం మండలం జనసేన పార్టీలో కీలక నాయకుడుగా ఉంటూ ఇటీవల గుండెపోటుతో చెందారు. దీంతో శనివారం చెముడులంక విచ్చేసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మంత్రి దుర్గేష్ వెంట నాయకులు గట్టి నరసయ్య, పాఠంశెట్టి రవి, అడబాల వీర్రాజు, అదిమూలం సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.



చెముడులంకలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి కందుల





కె.గంగవరం మండలం యర్రపోతవరంలో నేలకొరిగిన వరి కంకులను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు. పక్క చిత్రంలో ఆలమూరులో భారీ వర్షాలకు నేలకొరిగిన వరిపంట

అధైర్యపడొద్దు...సస్యరక్షణ చర్యలు చేపట్టండి

• రైతులకు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తల బృందం సూచన • నేలకొరిగిన పంటపొలాల పరిశీలన

కె.గంగవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అల్పపీడనం కారణంగా మండలంలో కురిసిన భారీ వర్షాలకు నేలకొరిగిన వరి పొలాలను శనివారం ఏరువాక శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. ఏరువాక కేంద్రం అమలాపురం కోఆర్డినేటర్ ఎం.నందకిషోర్, మార్టేరు శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, ఎం.ఆనందకుమార్, పీవీ రమేష్ బాబు తదితరులు పేకేరు, యర్రపోతవరం తదితర గ్రామాల్లో పర్యటించి పడిపోయిన వరి పొలాల్లోని కంకులను పరిశీలించారు. అనంతరం వారు రైతులతో మాట్లాడారు. అధైర్యపడవద్దని వారికి చెబుతూ తక్షణం చేయాల్సిన సస్యరక్షణ చర్యలు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ బి.నాగకుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి ఏ.సద్గురుమూర్తి తదితరులు ఉన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

మండపేట (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వరితోపాటు ఉద్యాన పంటలు దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. శనివారం మండపేట కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పంటలు నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పంట నష్టపోయిన ప్రాంతాల్లో పర్యటించి రైతులను ఆదుకోవాలన్నారు.

రైతులను అప్రమత్తం చేస్తున్న అధికారులు

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): ఇటీవల భారీ వర్షాల వల్ల దెబ్బతిన్న ఆయా పంటలను రక్షించుకోవడానికి తీసుకోవలసిన చర్యలపై అధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు. వరిపంట మూడు దశల్లో ఉందని దశల వారీగా పంటను రక్షించుకునేలా అధికారులు సూచనలు చేస్తూ రక్షణ చర్యలు చేపడుతున్నారు.

4వేల ఎకరాలు నేలకొరిగింది

సబ్ డివిజన్ అధికారి సీహెచ్‌కేవీ చౌదరి

ఆలమూరు సబ్ డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఇటీవలి భారీ వర్షాలకు దాదాపు నాలుగువేల ఎకరాల్లో వరిపంట నేలకొరిగిందని ఆయన తెలిపారు. దీనిలో 800 ఎకరాల్లో పంట నీటి మునిగిందన్నారు. వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో రైతులను అప్రమత్తం చేస్తున్నట్టు తెలిపారు.



ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ

రాయవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): రాయవరం రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ధాన్యం కొనుగోలు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తహశీల్దారు బీవీ భాస్కర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం జాగ్రత్తగా పరిశీలించాలన్నారు. ధాన్యం సేకరణలో రైతు అంగీకారం కోసం వేలిముద్ర సేకరించాలని, హమాలి ఖర్చులు రైతు ఖాతాలో జమవుతాయన్నారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లైస్ టెక్నికల్ సిబ్బంది శివకృష్ణ, పీఏసీఎస్ సిబ్బంది, వ్యవసాయ సహాయకులు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.



రాయవరం పోలీస్‌స్టేషన్ ఓపెన్ హౌస్‌లో పాల్గొన్న భాష్యం స్కూల్ విద్యార్థులు

ఓపెన్ హౌస్‌పై అవగాహన

రాయవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని రాయవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మత్తు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ అన్నారు. సైబర్ మోసాల బారినపడినప్పుడు 1930కి ఫోన్ చేయాలని సూచించారు. ఓపెన్ హౌస్ కార్యక్రమంలో రాయవరం భాష్యం స్కూల్ విద్యార్థులు పాల్గొని ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో భాష్యం ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా, ప్రైమరీ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, వైస్ ప్రిన్సిపాల్ ద్వారంపూడి చిన్నబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.



లీడర్ ట్రైనీని సత్కరిస్తున్న మాస్టర్స్

దేశరక్షణలో స్కౌట్ పాత్ర కీలకం

రావులపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): దేశరక్షణలో భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ పాత్ర కీలకమని లీడర్ ట్రైనీ డాక్టర్ బీవీ ప్రసాదరావు అన్నారు. రావులపాలెం బాలుర ఉన్నత పాఠశాలలో తూర్పుగోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల పరిధిలో స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్ సెంటర్‌లో అయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్స్‌ను పాఠశాలలో అమలు చేయడం వలన విద్యార్థులో దేశభక్తి, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. ఒకప్పుడు తూర్పుగోదావరి జిల్లా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉండేదని తిరిగి ఇప్పుడు పూర్వ వైభవం వస్తుందన్నారు. స్కౌట్ అండ్ గైడ్స్‌ను పీఎంశ్రీ పాఠశాలలో పకడ్బందీగా అమలు చేస్తున్న డీఈవో షేక్ సలీంబాషా, ఏపీసీ జి.మమ్మి, క్యాంప్ కోఆర్డినేటర్ పి.రాంబాబులను ఆయన అభినందించారు. స్కౌట్ మాస్టర్స్ ట్రైనింగ్ కార్యక్రమంలో వీఎన్‌కే గుప్తా, ఎస్ఆర్‌వీ బ్రహ్మేశ్వరరావు, జి.సుబ్బరాజు, షేక్ అజారుద్దీన్, ప్రసాదరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన అభివృద్ధిలో మహిళ పాత్ర అంశంపై శిక్షణ

రావులపాలెం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బోస్కో సేవా కేంద్రం ఆధ్వర్యంలో సర్పంచ్, వార్డు సభ్యులకు పరిపాలన అభివృద్ధిలో మహిళల పాత్ర కీలకం అంశంపై శిక్షణ నిర్వహించారు. రావులపాలెం పారా వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో పరిపాలన అభివృద్ధిలో మహిళ పాత్ర, వారు సాధించిన విజయాలను తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రీజనల్ కోఆర్డినేటర్ సోడాబత్తిన అంబేడ్కర్ పలు అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమానికి టి.రమేష్, పారా కోఆర్డినేటర్ రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహించారు. వీలీడ్ ఇన్‌చార్జ్ పోతుమూడి శేషరత్నం, వేజ్ డైరెక్టర్ పి.శాంతకుమారి, నవోదయ మహిళా మండలి డైరెక్టర్ శేషారత్నం, సర్పంచ్‌లు గెడ్డం సుధా, కె.లక్ష్మి, బూసి జయలక్ష్మి, హేమలత, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



గంగవరంలో ఉచిత వైద్య శిబిరంలో రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

840 మందికి ఉచిత వైద్య పరీక్షలు

కె.గంగవరం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలో రెండు రోజులుగా నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 840 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, టీట్రీ ఆసుపత్రి సీఎస్ఆర్ నిధులతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో షుగర్, బీపీ, ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యం చేయించుకున్న వారికి సబ్బు, పేస్టు, షాంపు వంటి పలు ఉపకరణాలతో కిట్‌ను అందజేశారు. ఆయా ఆసుపత్రి సిబ్బంది వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు చిర్రా రాజ్‌కుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరికలు

మండపేట, అక్టోబరు 25 (ఆంధ్ర జ్యోతి): మండపేట మండలం వైసీతా నగరానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ అద్దాల శ్రీదేవితోపాటు గ్రామానికి చెందిన వైసీపీ గ్రామ కమిటీ మాజీ అధ్యక్షుడు వీర వెంకట సత్యనారాయణ (రామరాజు) శనివారం టీడీపీ గ్రామ కమిటీ అధ్య క్షుడు అయినంపూడి నాగరాజు ఆధ్వర్యం లో శనివారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వర రావు వద్ద టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమం లో పార్టీలో చేరిన వారిని ఆయన సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరామని వారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వాసు, పి.వెంకటవర్మరాజు, వీర్రాజు నంబూరి రామరాజు, ఎర్రబ్బు, మేకా జేజి బాబు, పలివెల డానియేలు తదితరులు వున్నారు.



ఎమ్మెల్యే వేగుళ్ల సమక్షంలో టీడీపీలో చేరిన దృశ్యం

ఫార్మసీ విద్యార్థుల ప్రతిభ

ఆత్రేయపురం, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన హనుమంతు మౌనిక ఆదిత్య భీమవరంలో బీఫార్మసీ నాలుగవ సంవత్సరం చదువుతున్నారు. సహచర విద్యార్థులు శ్రీవల్లిక, వైనిష్ణు, శారద కలిసి వాయిస్ యాక్టివేటెడ్ పెండెంట్ ప్రాజెక్టును తయారు చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల మహిళలకు ఏదైన ఆపద సంభవిస్తే ఎమర్జన్సీలో ఎవరి సహాయం లేకుండా దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్ షీ టీమ్ సమీప ప్రాంతంలోని బంధువులకు ఆటోమెటిక్‌గా ఫోన్‌కాల్ వెళుతుందని వారు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలకు ఈ ప్రాజెక్టు రక్షణ గా నిలుస్తుందన్నారు. ఈ ప్రాజెక్టు ప్రథమస్థానంలో నిలవడంతో విద్యార్థులను ప్రిన్సిపాల్ నటరాజన్ తదితరులు అభినందించారు.



భీమవరంలో ఫార్మసీ విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి డిగ్రీ ప్రవేశానికి ఆఖరి దర కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు తెలిపారు. మొదటి, రెండవ దశలో సీట్లు పొందని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీ బీజడ్‌సీలలో అందుబాటులో ఉన్నాయని అడ్మిషన్ రిజిస్ట్రేషన్ ఈ నెల 25, 26 తేదీలలో చేసుకోవాలని వెబ్‌ఆప్షన్లు ఈ నెల 28, 29 తేదీలలో నమోదు చేసుకోవాలన్నారు. సీట్ల కేటాయింపు నవంబరు 1న ఉంటుందని సీట్లు పొందిన విద్యార్థులు నవంబరు 4వ తేదీలోపు కళాశాలలో రిపోర్టు చేయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రోడ్డు దిగబడిపోయినా పట్టించుకోరా...?

మండపేట, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మండపేట శివారు వున్న గొడ్డుకాల్వను చేర్చి ఆలమూరు మండపేట మెయిన్ రోడ్డు నుంచి పేపరు మిల్లు రోడ్డు మీదుగా చమురు గ్యాస్ నిక్షేపాల సంస్థ (ఓఎన్‌జీసీ) నిర్మించిన రోడ్డు రెండు చోట్ల కుంగిపోయి జారిపోయింది. మండపేట పట్టణం శివారు గొల్లపుంత కాలనీకి కూతవేటు దూరంలో రైతుల పంటపొలాల్లో చమురు నిక్షేపాల కోసం వారి నుంచి పొలాలను సేకరించి కార్యకలాపాలకు సిద్ధం చేసింది. అక్కడున్న స్థలానికి సంస్థకు చెందిన భారీ వాహనాలు వచ్చేలా సంస్థ డ్రైనేజీ సంస్థకు చెందిన మురుగు కాల్వగట్టును రోడ్డును నిర్మించింది. అరోడ్డు రెండుచోట్ల జారిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రతిరోజూ ప్రజలు, రైతులు రాకపోకలు సాగించే ఈ రోడ్డు దెబ్బతినటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా జాప్యం చేయకుండా సత్వరమే కుంగిపోయిన రోడ్డును నిర్మించాలని స్థానికులు, వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



మండపేటలో కుంగిన ఓఎన్‌జీసీ రోడ్డు